ప్రజాశక్తి
శనివారం 20 జనవరి 2024 5
శ్రీ సత్యసాయి





పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, తదితరులు

పారిశుధ్యం .. అధ్వానం

- రూ. కోట్లు కరుగుతున్నా తప్పని దోమ కాట్లు
- పట్టించుకోని అధికారులు
- మూలన పడ్డ చెత్త సేకరణ వాహనాలు



ఎల్ఐసి కార్యాలయం ఎదురుగా పేరుకు పోయిన చెత్త

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. ప్రతి వీధిలోనూ చెత్త పేరుకు పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కొన్ని వీధుల్లో, కాలువల్లో ఉన్న వ్యర్థాలను నెలల తరబడి తొలగించడం లేదు. దీనికి తోడు పట్టణంలో నూతన కాలువల నిర్మాణం లేకపోవడంతో మురుగు నీరంతా రహదారులపై చేరుతోంది. ప్రభుత్వం ప్రతి 2 వేల కుటుంబాలకు ఓ సచివాలయం చొప్పున నూతన వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినా పరిస్థితిలో ఎక్కడా మార్పు కనిపించడం లేదు.

ప్రజాశక్తి-హిందూపురం

క్షేత్రస్థాయిలో పర్యటించని కార్యదర్శులు

పట్టణంలో జనాభాకు సరిపడే పారిశుధ్య కార్మికులున్నా చెత్త సమస్య పరిష్కారం కావడం లేదు. కనీసం వారానికి ఓ సారి కూడా కాలువలు శుభ్రపరచడం లేదు. ప్రధాన రహదారుల వెంట నిర్మించిన కాలువల్లో అయితే నెలలు గడుస్తున్నా వ్యర్థాలను తొలగించడం లేదు. ఫలితంగా పట్టణంలో దోమలు స్వైర విహారం చేస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పట్టణంలో మొత్తం 38 వార్డుల్లో 43 సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు, దాదాపు 365 మంది కార్మికులు విధుల్లో ఉన్నారు. సచివాలయాల వారీగా పారిశుధ్య నిర్వహణను కార్మికులకు కేటాయించారు. వారంతా ఆయా కార్యదర్శుల పర్యవేక్షణలో ఉంటూ పనులు చేయాల్సుంది. కానీ కొంత మంది కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించ కుండా ఇళ్ల వద్ద నుంచే మార్గదర్శకాలు ఇస్తున్నారు. దీంతో పర్యవేక్షణ కొరవడి ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోతోంది. రహమత్‌పురం రైల్వే స్టేషన్ ఎదురుగా, ఎల్ఐసి కార్యాలయం, హస్నాబాదు రోడ్డు, బెంగళూరు రోడ్డు, బాలాజీ టాకీస్ రోడ్డు, ధర్మపురం, ఆజాద్ నగర్, ఆర్‌టిసి కాలనీ, త్యాగరాజ్ నగర్ తదితర ప్రాంతాలలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ఆర్‌పిజిటి రోడ్డులో అసుపత్రి నిర్వాహకులు అసుపత్రి వ్యర్థాలను పడేస్తున్నారు. వాటిని రోజుల తరబడి తరలించకుండా అలాగే ఉంచుతుండడంతో పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత వారం పారిశుధ్య కార్మికుల సమ్మె పేరుతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వారు సమ్మె విరమించిన అనంతరం మంత్రి పెదిరెడ్డి రామచంద్రా రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ పట్టణంలో పర్యటిస్తుండడంతో వారు పర్యటించే ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆ రోడ్లకు మాత్రమే బ్లీచింగ్, సున్నం వేసి అందంగా తీర్చిదిద్దారు. సందులు, కాలనీల్లో చెత్త సేకరణ నుంచి మురుగు కాలువల శుభ్రం వరకు ఏ మాత్రం దృష్టి సారించడం లేదు. నెలకు కార్యదర్శుల నుంచి కార్మికుల వరకు సుమారు అరకోటి రూపాయల వరకు వేతనాల రూపంలో ఖర్చు అవుతున్నప్పటికి పారిశుధ్యం మాత్రం అధ్వాన్నంగా ఉంది. కోట్ల రూపాయలు కరిగిపోతున్నా పట్టణ వాసులకు దోమల కాట్లు మాత్రం తప్పడం లేదు.

ఫాగింగ్ ఊసే లేదు..

ప్రజల ప్రాణాలకు పెద్దపీట వేయాల్సిన కొందరు అధికారులు, పాలకులు వారి సొంత లాభార్జన కోసం పాకులాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీజనల్ వ్యాధులతో పాటు దోమ లార్వా ప్రబలకుండా ఉండేందుకు బ్లీచింగ్, పాగింగ్ వంటి పనులు చేపట్టాల్సి ఉంది. కాసులకు కక్కుర్తి పడే కొందరు బ్లీచింగ్ పౌడర్ స్థానంలో చాక్ పీసులు తయారు చేసే తెల్ల సున్నం పొడిని వినియోగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు, పాలకుల పర్యటనలున్న సమయంలోనే అది కూడా వినియోగిస్తున్నారే తప్ప తక్కిన సమయాల్లో దాని ఊసే లేదు. రసాయనాలతో కూడిన మిశ్రమాన్ని పాగింగ్ చేయించాల్సిన అధికారులు ఫాగింగ్ సైతం చేయించడం లేదు. కాలువల్లో దోమల లార్వ నివారణ కోసం మందు పిచికారి చేయాల్సి ఉంది. ఇది సైతం చేయడం లేదు. అయితే పూర్తి స్థాయిలో బ్లీచింగ్, ఫాగింగ్ చేయిస్తున్నట్లు దస్త్రాల్లో నమోదు చేస్తూ నిర్వహణ నిమిత్తం లక్షల రూపాయల ఖర్చు చూపిస్తు ప్రజాదనాన్ని కొందరు అధికారులు భారీగా దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మూలన పడ్డ చెత్త సేకరణ వాహనాలు

పట్టణంలో చెత్తను సేకరించేందుకు జగనన్న స్వచ్ఛ సంకల్పం కింద 22 వాహనాలు వచ్చాయి. వాటిని పట్టణంలోని వివిధ ప్రాంతాలలో చెత్త సేకరణ కోసం వినియోగించే వారు. ఇందులో 7 వాహనాలు మరమ్మతుకు గురి కావటంతో అవి మూలన పడ్డాయి. వీటి నిర్వహణ భాద్యతలను ప్రభుత్వం ప్రైవేటు కంపెనీకి చెందిన గుత్తేదారుకు అప్పజెప్పింది. పురపాలక పరిధిలో చెత్తను సేకరించినందుకు ప్రతినెల గుత్తేదారుకు రూ.60వేలకు పైగా అద్దె చెల్లించాలి. ఈ వాహనాలతో పురపాలక సంఘంలోని పలు వార్డుల్లో చెత్త సేకరణ చేపడుతున్నారు. ప్రతి ఇంటికి చెత్త సేకరణ పన్నులు చెల్లించాలని ఆదేశాలు సైతం జారీ చేశారు. పన్నుల రూపంలో ప్రతి నెల రూ. రూ. 6.50లక్షలు పైగా ఆదాయం చేకూరేది. అయితే గుత్తేదారుడు వాహన చోదకులకు సక్రమంగా వేతనాలు చెల్లించక పోవడంతో వాహనాలను కొన్ని నెలలుగా నిలిపివేశారు. దీంతో రూ. లక్షల విలువ చేసే వాహానాలను మూలన పడేయడంతో ప్రజాధనం వృథాగా మారిందని పట్టణవాసులు వాపోతున్నారు.



కాలువలో పేరుకుపోయిన మురుగు నీరు



మూలన పడ్డ చెత్త సేకరణ వాహనాలు

193 చెరువులను నింపడమే ధ్యేయం

పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

ప్రజాశక్తి - నల్లమాడ, పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులు నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నల్లమాడ మండలంలోని ఎనుములవారి పల్లెలో నల్లకొండ రిజర్వాయర్ కు భూమి పూజ చేసి పైలాన్‌ను ఆవిష్కరించిన దుద్దుకుంట అక్కడ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు శంకర్ నారాయణ, పివి సిద్ధారెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈసందర్భంగా దుద్దుకుంట మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా వెనుకబడిన పుట్టపర్తి నియోజకవర్గంలోని రైతుల కళ్లలో ఆనందం చూడాలన్న లక్ష్యంతోనే హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ద్వారా రూ. 864 కోట్లతో 193 చెరువులో నింపుతున్నామన్నారు. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని నమ్మిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నమ్ముతున్నందున ఈ చెరువులు నింపే కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. నాటకాలు బూటకాలు ఆడడం పల్లె రఘునాథరెడ్డికి, చంద్రబాబుకు మాత్రమే తెలుసు అని ఎద్దేవా చేశారు. చెప్పింది చేయడమే తమ లక్ష్యం అన్నారు. హంద్రీనీవా జలాలను తెచ్చిన ఘనత వైఎస్. రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ మేరకు 193 చెరువులు నింపే కల నెరవేరుతోందన్నారు. ప్రతిపక్షాలు ప్రజలను మభ్యపెట్టి ఓట్లను దండుకోవాలని చూస్తున్నాయని విమర్శించారు. నియోజకవర్గంలో తొమ్మిది రోజులపాటు 163 గ్రామాలో ఈ పాదయాత్ర కొనసాగనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, వైసిపి పార్లమెంట్ ఇన్‌ఛార్జి శాంతమ్మ, ఎంపీపీ సునీత బాయి, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి, వైస్ చైర్మన్లు శ్రీ లక్ష్మీ నారాయణ రెడ్డి, తిప్పన్న, ఆరు మండలాల పార్టీ కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైట్‌ఫీల్డ్ లో నర్సింగ్ కాలేజీ ప్రారంభం

ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్

బెంగళూరులోనీ శ్రీ సత్య సాయి ఇన్స్యుట్యూట్ ఆఫ్ హైయర్ మెడికల్ సైన్సెస్ విభాగంలో నర్సింగ్ కళాశాల భవనాన్ని కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ శుక్రవారం ప్రారంభించారు. సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నర్సింగ్ విద్యార్థుల కోసం 6 కోట్ల రూపాయలతో ఈ భవనాన్ని నిర్మించామని ట్రస్ట్ వర్గాలు తెలిపాయి.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల క్రితం తను ఒక బహిరంగ కార్యక్రమంలో సత్య సాయి బాబాను మొదటిగా దర్శించానని చెప్పారు. సేవా సంస్థలకు తన మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ కే చక్రవర్తి, మేనేజింగ్ ట్రస్ట్ ఆర్ జె రత్నాకర్, ఎస్ఎస్ నాగానంద్, మనోహర్‌శెట్టి, హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సుందరి కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



కర్నాటక ఉపముఖ్యమంత్రికి సత్యసాయి చిత్రపటాన్ని అందజేస్తున్న ట్రస్టు సభ్యులు



పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటుతున్న వాలంటీర్లు

మొక్కలు నాటిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని సప్తగిరి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా శుక్రవారం సేవా మందిర్ ఆంధుల పాఠశాల ఆవరణంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మంజూనాథ్, ఎఒ గంగిరెడ్డి మాట్లాడుతు పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు ప్రకాష్ రెడ్డి, నాగేందర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

కొట్నూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలోని 1వ వార్డు కొట్నూరులో శుక్రవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు వివరించారు. అదే విధంగా ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ,చైర్ పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరాం రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫిర్దోస్ ఖలీల్, వైస్ చైర్మన్ రాచపల్లి మహేంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కాణిపాకం టెంపుల్ డైరెక్టర్ రవీంద్రుడు, కౌన్సిలర్లు షాజియా, మణ, జెసిఎస్ కన్వీనర్ శివ శంకర్ రెడ్డి, టౌన్ ఎ బ్లాక్ మహిళా విభాగం కన్వీనర్ భాను, వార్డు ఇన్‌ఛార్జులు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని 33, 34 వార్డుల పరిధిలో రూ.20లక్షలతో చేపట్టిన సిసి నిర్మాణ పనులను వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణురెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు జబివుల్లా, బలరామిరెడ్డి, కౌన్సిలర్లు షాజియా, లక్ష్మి మహేష్ గేడ్, మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్లా, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇంటింటి ప్రచారం

ముదిగుబ్బ : ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మండల పరిధిలోని గుడ్డంపల్లితండా, ఒడ్డుకిందతండా, సానేవారిపల్లి, మల్లమ్మ కొట్టాలు, ఎన్ఎస్పీ కొట్టాల గ్రామాల్లో పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వైసిపిని మరోమారు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సివి. నారాయణరెడ్డి, నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, జడ్పిటిసి తిరుమల సేవేనాయక్, కో ఆప్షన్ సభ్యులు చిన్న బాలముని, భాస్కర్ పాల్గొన్నారు

వైసిపిలో సగం స్థానాలు ఖరారు..

మిగిలినవి వడివడిగా పూర్తి .. టిడిపి జాబితాలెప్పుడో..?



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు వైసిపి వడివడిగా కసరత్తు పూర్తి చేస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికే సగం స్థానాలపై అభ్యర్థులెవరన్న దానిపై స్పష్టతనిచ్చింది. ఆ పార్టీ ఇప్పటి వరకు నాలుగు జాబితాలను విడుదల చేసింది. ఇందులో కొత్త సమన్వయకర్తలను నియమించింది. రెండు పార్లమెంటు స్థానాలతోపాటు ఏడు అసెంబ్లీ స్థానాలకు కొత్త సమన్వయకర్తలను నియమించింది. తక్కినవి కూడా త్వరలోనే నియమించనున్నట్టు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

ఏడు అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలకు నియామకం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలున్నాయి. వైసిపి ఇందులో రెండు పార్లమెంటు స్థానాల్లోనూ మార్పులు చేసింది. అనంతపురానికి మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే శంకర నారాయణను నియమించింది. సిట్టింగు ఎంపీ రంగయ్యను కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. ఇక హిందూపురం పార్లమెంటుకు సిట్టింగు ఎంపీ గోరంట్ల మాధవ్‌ను తొలగించి కర్నాటకకు చెందిన శాంతను నియమించింది. ఈ రకంగా రెండు ఎంపీ స్థానాలకు కొత్త సమన్వయకర్తలొచ్చారు. ఇద్దరూ ఇప్పటికే వారి పరిధిలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇక అసెంబ్లీ స్థానాలకు వచ్చే సరికి రెండో జాబితాలో కళ్యాణదుర్గం, పెనుకొండ, కదిరి మూడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఇందులో చూసినప్పుడు కళ్యాణదుర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఉష శ్రీచరణ్‌ను పెనుకొండకు మార్చారు. అనంతపురం ఎంపీ రంగయ్యను కళ్యాణదుర్గానికి మార్చారు. కదిరి సిట్టింగు ఎమ్మెల్యే సిద్దారెడ్డిని మార్చేసి మక్బుల్‌కు చోటు ఇచ్చారు. మూడో జాబితాలో రాయదుర్గం నియోజకవర్గానికి మెట్టు గోవిందరెడ్డిని నియమించారు. నాలుగో జాబితాలో ఎస్సీ రిజర్వు స్థానాలైన మడకశిర, శింగనమల నియోజకవర్గం సిట్టింగు ఎమ్మెల్యేల స్థానంలో కొత్తవారికి చోటు కల్పించారు. శింగనమలలో జొన్నలగడ్డ పద్మావతిని తొలగించి వీరాంజినేయులును నియమించారు. మడకశిర అసెంబ్లీ నియోజకవర్గంలో సిట్టింగు ఎమ్మెల్యే తిప్పేస్వామిని మార్చి ఈరలక్కప్పను నియమించారు. హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా దీపికను ఇది వరకే నియమించారు. ఈ రకంగా మొత్తం ఏడు స్థానాల్లో మార్పులు జరిగాయి. తక్కిన ఏడింటిలోనూ మార్పులు త్వరలోనే పూర్తయ్యే అవకాశాలున్నట్టు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

టిడిపిలో ఎప్పుడో ..?

అధికార వైసిపిలో ఒక్కో స్థానాల్లో సమన్వయకర్తలను నియమిస్తూ వస్తుండటంతో ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీలో ఉత్కంఠ రేగుతోంది. టిడిపి అభ్యర్థులను ఎప్పుడు ఖరారు చేస్తుందోనన్న చర్చ నడుస్తోంది. ఇదే అంశాన్ని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి కూడా మాట్లాడటం గమనార్హం. టిడిపి కూడా త్వరగా అభ్యర్థులను ఖరారు చేస్తే బాగుంటుందని ఆయన అన్నారు. ఇతర నేతలు కూడా బాహాటటంగా ప్రకటించకున్నా ఇదే మాటను అంతర్గత సమావేశాల్లోనూ చెబుతున్నారు. పూర్తిగా ఎన్నికలు దగ్గరపడే వరకు కాకుండా ముందే తేలిపోతే ఎన్నికలకు పూర్తి స్థాయిలో సన్నద్ధమయ్యే అవకాశంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. అయితే టిడిపి జనసేన పొత్తుల నేపథ్యంలో స్థానాలపై కొంత సందిగ్ధత తేలాక ప్రకటించే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

అంగన్వాడీ కేంద్రంలో దొంగలు పడ్డారు...

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం చౌళూరు సెక్టార్ పరిధిలోని దేవరపల్లి ఒకటో అంగన్వాడీ కేంద్రంలో దొంగలు పడిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న 18 కేజీల బియ్యం, 2కేజీల దాల్, 5 కేజీల ఆయిల్, 208 గుడ్లు, గ్యాస్ స్టవ్, గ్యాస్ సిలెండర్, 13 అన్నం ప్లేట్లను దుండగులు ఎత్తుకెళ్లారు. 39 రోజులుగా అంగన్వాడీలు సమ్మెలో ఉండడంతో అటు వైపు ఎవరు వెళ్లక పోవడంతో ఈ దొంగతనం జరిగినట్లు గ్రామ ప్రజలు అంటున్నారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.



కేంద్రం తాళం పగల గొట్టిన దృశ్యం



హిందూపురంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష చేస్తున్న అంగన్వాడీలు

సడలని సంకల్పం

తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు సడలని సంకల్పంతో నిరవధిక సమ్మెలో పాల్గొంటున్నారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక దీక్షలు శుక్రవారానికి 39వ రోజుకు చేరుకున్నాయి. రోజుకో రీతిలో అంగన్వాడీలు తమ నిరసన కొనసాగిస్తున్నారు. అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిన వెరవకుండా సమ్మెను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన నోటీసుకు సమాధానంగా తమ లేఖలను అందజేశారు. అంగన్వాడీల సమ్మెకు సిపిఎం,ఇతర వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రతిపక్షపార్టీలు తమ మద్దతు తెలుపుతున్నాయి.

అంబేద్కర్‌కు అంగన్వాడీల మొర

సత్యాగ్రహ దీక్ష చేపట్టి నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

అంగన్వాడీలకు కనీస వేతనాలు ఒడిమాండ్ చేస్తూ ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 39 వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు పట్టణం లోని అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహం ముందు సత్యాగ్రహ నిరసన కార్యక్రమం చేపట్టారు. వీరి ఆందోళనకు కెవిపిఎస్ జిల్లా కార్య దర్శి రమణ మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జ్యోతమ్మ, నాయకులు నారాయణ, గోపాల్, వెంకటేష్, అంగన్వాడి యూనియన్ నాయకులు శిరీష, శైలజ, నాగమ్మ, వరలక్ష్మి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పట్టణంలో అంగన్వాడీల సమ్మె 39వ రోజూ కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సందర్భంగా శుక్రవారం అంగన్వాడీలు సత్యాగ్రహ నిరసన దీక్ష చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. రాజ్యాంగ బద్ధంగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల పై ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగించడం, ఎస్మా పరిధిలో తీసుకొచ్చి ఉద్యోగాలను తొలగిస్తామని బెదిరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు మాబున్నీసా, శారద, సుజాత, లక్ష్మీదేవి, చంద్రకళ, సువర్ణ, సంధ్య, సిఐటియు నాయకులు జివిఎల్.నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, బాబ్జాన్ పాల్గొన్నారు.

పరిగి : అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ సిఐటియు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. అక్కడే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమం లో సిఐటియు జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు మండల నాయకులు లింగారెడ్డి లింగారెడ్డి, పద్మ పాల్గొన్నారు.

ఓబులదేవరచెరువు : సమ్మెలో భాగంగా అంగన్వాడీలు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి వినతి పత్రం అందజేశారు. మహమ్మదాబాద్ క్రాస్‌లో నల్లమాడ, అమడగూరు మండలాలు అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. వీరికి సిఐటియు నాయకులు లక్ష్మీనారాయణ, బాబా, కుళ్లాయప్ప మద్దతు తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు వద్ద శిబిరంలో రంగమ్మ, మణిమాల, కిష్టమ్మ, అలివేలు, కమలమ్మ, వరలక్ష్మి, అరుణమ్మ, ఆశీర్వాదమ్మ, అనసూయ, సుకన్య, సుజాత, విమలమ్మ, జయమ్మ సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

మడకశిర : సమ్మెలో భాగంగా అంగన్వాడీలు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ముందు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించేంతవరకూ దశల వారీగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గాండ్లపెంట : యూనియన్ మండల అధ్యక్షురాలు లక్ష్మీదేవి, భారతి, సుజాత ఆధ్వర్యంలో అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. వారు మాట్లాడు తూ అంగన్వాడీల గోడు ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించా రు. శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : అంగన్వాడీ సిబ్బంది స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. వీరికి సిఐటియు, సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. శిబిరంలో సత్య, ఇందుమతి, రజియా, సుగుణ, నాగరత్న, సరస్వతి, శివమ్మ, శ్రీదేవి, సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు నాయకులు బాబు, వెంకటేశు, పోతలయ్య , తదితరులు పాల్గొన్నారు

నల్లచెరువు : నల్లచెరువులో అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. శిబిరాన్ని సిఐటియు నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు రామకృష్ణ, రైతు సంఘం నాయకులు శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమేష్, పద్మావతి, సరస్వతి పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : సమ్మెలో భాగంగా అంగన్వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. వీరికి ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ మండల అధ్యక్షులు ఎల్.ఆదినారా యణ, కార్యదర్శి అయూబ్‌ఖాన్, ట్రాన్స్‌పోర్ట్ రంగం రాష్ట్ర నాయకులు రఫీ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు శ్రీదేవి, కోశాధికారి దేవి, నాయకురాళ్లు పోతక్క, ధీన, చింతమ్మ, మాంచాలిదేవి, గంగమ్మ, విజయ, భువనేశ్వరి పాల్గొన్నారు.

సొమ్మసిల్లి పడిపోయిన ఆయా

మండల పరిధిలోని కుటుతూరు గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తున్న ఆయా పద్మావతి ఉన్నఫలంగా బీపీ ఎక్కువై శిబిరం వద్ద సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

బత్తలపల్లి : సమ్మెలో భాగంగా శిబిరంలో అంగన్వాడీలు అంబేద్కర్ చిత్రపటం ఉంచి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరికి సిఐటియు జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ దిల్షాద్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షురాలు వాసంతి, ప్రధాన కార్యదర్శి రజియా, సెక్టార్ లీడర్లు వసంత, రజిత, కృష్ణవేణి, సున్నిబేగం, జయసుధ, అరుణ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

పెనుకొండ : సమ్మెలో భాగంగా అంగన్వాడీలు సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. రమేష మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని విస్మరించి రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తున్న సిఎం జగన్‌కు అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరణ చేసే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఇంతియాజ్, తిప్పన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు జయమ్మ, బావమ్మ, మాబున్నీసా, వరలక్ష్మి, అనిత, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అమరాపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. శిబిరం లో సిఐటియు నేత మహబూబ్ ఖాన్, యూనియన్ లీడర్లు నాగవేణి, అనసూయమ్మ, మంజుల చంద్రకళ నాగరత్నమ్మ స్వారక్క పాల్గొన్నారు.

చిలమత్తూరు : అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటేష్, లక్ష్మినారాయణ, నాయకురాళ్లు శోభమ్మ, శారద, రామతులసి, ఈశ్వరమ్మ, జయమ్మ, పద్మక్క, మాలీనా పాల్గొన్నారు.

కొత్తచెరువు : ప్రభుత్వం అంగన్వాడీలపై పాల్పడుతున్న బెదిరింపులకు వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ హెచ్చరించారు. సమ్మెలో భాగంగా అంగన్వాడీ సిబ్బంది స్థానిక అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బేల అంజి, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సుజాత, నాయకురాళ్లు శ్రావణి, శ్రీదేవి పాల్గొన్నారు

లేపాక్షి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీ సిబ్బంది అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకుడు నరసింహప్ప, ధనమ్మ, శివమ్మ, పార్వతి, భాగ్యమ్మ, రత్నమ్మ పాల్గొన్నారు.



కొత్తచెరువులో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్వాడీలు



కదిరిలో సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న అంగన్వాడీలు



పెనుకొండలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన



ధర్మవరంలో మోకాళ్లపై నిల్చొని..



లేపాక్షిలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తూ..

పకడ్బందీగా కులగణన సర్వే : జెసి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



కుల గణన సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న జెసి అభిషేక్ కుమార్

కుల గణన సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. జెసి శుక్రవారం జిల్లా ప్రణాళిక గణాంకాల అధికారి విజయకుమార్, మున్సిపల్ కమిష నర్ రామ్‌భూపాల్ రెడ్డితో కలిసి పట్టణంలోని గోకులం వీధిలో కులగణన సర్వే ప్రక్రియను పరిశీలించా రు. జెసి మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకమునుపే 1931లో దేశంలో కుల గణన జరిగిందని, ప్రస్తుతం ఎపిలో ప్రభుత్వం కులగనన సర్వే చేపట్టినట్లు తెలిపారు. కులగణనపై అపోహలు, సందేహాలు అవసరం లేదని ప్రజలకు సూచించారు. వివిధ కులాలు, ఉప కులాల గణన పూర్తి చేయడం ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలను నేరుగా అందించడానికి ప్రభుత్వం సర్వేకి శ్రీకారం చుట్టిందన్నారు. పేద రిక నిర్మూలన, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కులగణన ఎంతగానో ఉపయోగపడు తుందన్నారు. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు ఇంటింటికీ వస్తారని ప్రజలు వారి కుటుంబ వివరా లు, జీవన ప్రమాణ ఆర్థిక స్థితిగతులను తెలియజేయాలన్నారు. ఆ సమయంలో ఇళ్లలో అందుబాటులో లేని వారు ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ గ్రామ, వార్డు సచివాలయాల్లో సమాచారం నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలోని 544 గ్రామ, వార్డు, సచివాలయ సిబ్బంది 9,800 మంది వాలంటీర్లు ఈ సర్వేలో పాల్గొంటున్నారని, ప్రజలందరి సహకారం తో విజయవంతంగా పూర్తి చేయాల ని కోరారు. వారి వెంట మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహులు, వార్డు సెక్రటరీ సౌభాగ్య, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ఇంటి వద్దకు వచ్చే కుల గణన సర్వే అధికారులు, సిబ్బందికి ప్రజలు సరైన సమాచారం ఇచ్చి, సర్వేను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల కోరారు. వారు మాట్లాడుతూ వాలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు ఇంటి వద్దకే వచ్చి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, యజమాని వేలిముద్రలచే మ్యాపింగ్ చేస్తార న్నారు. వారికి ప్రజలు ఎటువంటి ఆధారాలు ఇవ్వా ల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో టిపిఆర్ఓ సుబ్బ రాయుడు, మేనేజర్ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

రొద్దం : అణగారిన వర్గాల అభ్యున్నతికే కులగణన అని గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారి శివారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తురకలాపట్నం, కోగిర, నారనాగేపల్లి గ్రామాల్లో చేపట్టిన కులగణన, వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాలను శుక్రవారం ఆయన ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్‌తో పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ అర్హులందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నల్లచెరువు : స్థానిక సచివాలయం-1 పరిధిలో ఎంపిడిఒ శకుంతల, తహశీల్దార్ రవికుమార్, ఎంపిపి రమణారెడ్డి కులగణన సర్వేను ప్రారంభించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ పది రోజులు కొనసాగుతుందన్నారు.

కొత్తచెరువు : వాలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుల గణన సర్వేను వేగవంతం చేసి సమగ్రంగా నిర్వహించాలని ఎంపిడిఒ బారాన్‌సాహెబ్ ఆదేశించారు. ప్రజల సమాచారాన్ని ప్రభుత్వ యాప్‌లో పొందుపరచాలన్నారు. ప్రజలు వీరికి సహకరించాలని ఆయన కోరారు.

కాలనీల్లో కనీస సౌకర్యాలు కరువు : పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్



పరిటాలశ్రీరామ్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన చోట మౌలిక వసతులు కల్పించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలు పట్టవా అని నియోజకవర్గ టిఇపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ప్రశ్నించారు.'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా శుక్రవారం శ్రీరామ్ పట్టణంలోని ఎల్-1, ఎల్-2 కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కాలనీల్లో తాగునీరు, డ్రెయినేజీ, సీసీ రోడ్లు, తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పరిటాల శ్రీరామ్‌కు విన్నవించారు. కార్యక్రమంలో కమతం కాటమయ్య, ఫణికుమార్, పరిశే సుధాకర్, భీమనేని ప్రసాద్‌నాయుడు, పురుషోత్తంగౌడ్, అంబటి సనత్, నాగూర్‌హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, గరుగు వెంగప్ప, కత్తుల బాబీ, పల్లపు శంకర్, బొట్టు కిష్ట, ఓంకార్, కేతినేని రాజ, రామాంజి, అమర్నాథ్‌చౌదరి, కేశవ, జనార్ధన, మాధవరెడ్డి, గోసల శ్రీరాములు, ఆడ్రా మహేశ్, మారుతిస్వామి, కరెంటు ఆది పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత జగన్‌కు లేదు

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత సిఎం జగన్‌కు లేదని పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలో శ్రీరామ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి పాలనలో దళితులపై 6వేలకు పైగా దాడులు జరిగాయని, 188 మంది హత్యకు గురయ్యారన్నారు. అప్పుడు నోరు మెదపని సిఎం జగన్ ఇప్పుడు నా ఎస్సీ, నా ఎస్టీ అంటూ ఊదరగొడుతున్నారని విమర్శించారు. దళితులకు రాజ్యాంగం ప్రకారం అమలు కావాల్సిన 27 సంక్షేమ పథకాలను రద్దుచేసి, ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని విగ్రహావిష్కరణ చేస్తావని ప్రశ్నించారు. సమావేశంలో కేశగాళ్ల శ్రీనివాసులు, కిరోసిన్ పోతలయ్య పాల్గొన్నారు.

దళిత ద్రోహి సిఎం జగన్ : టిడిపి

ప్రజాశక్తి-మడకశిర

దళిత ద్రోహి సిఎం జగన్ అని టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్, జయకుమార్, డాక్టర్ కృష్ణమూర్తి, రొళ్ల కృష్ణమూర్తి తీవ్రస్థాయిలో విమర్శించారు. వారు శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. వైసిపి పాలనలో రాష్ట్రంలో దళితులపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుడిని చంపి డోర్ డెలివరీ చేయడం, మహిళలను ట్రాక్టర్‌తో తొక్కించి చంపడం, మాస్క్ అడిగిన డాక్టర్ సుధాకర్‌ను మానసిక క్షోభ పెట్టడం, ఎస్సీ కార్పొరేషన్ నిధులు దారి మళ్లింపు, పోలీస్ స్టేషన్‌లోనే శిరోముండనం, తదితర సంఘటలపై ఏనాడూ స్పందించని సిఎం జగన్ ఎన్నికలకు ముందు అంబేద్కర్ పెద్ద విగ్రహం పెడితే దళితుల ఓట్లు పడతాయనుకోవడం వారి భ్రమ అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు సిఎం కావడం ద్వారానే దళితుల జీవితాలు బాగుపడుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచి నాగరాజు, కౌన్సి లర్ ఉమాశంకర్, నాయకులు మనోహర్, లక్ష్మీనారాయణ, దాసిరెడ్డి, కుమారస్వామి, జయకుమార్, కృష్ణమూర్తి, రంగేగౌడ్, ఈరన్న, ప్రకాష్, దుర్గేష్, రామాంజనేయులు, నరసింహప్ప, లక్ష్మీనరసప్ప, భీమరాజు, భరత్, తిమ్మరాజు, సుబ్బారెడ్డి, గిరియన్న, బూదిపల్లి జయరామప్ప, అడ్వకేట్ శివ కుమార్, షబ్బీర్, రామకృష్ణ, నాగభూషణ్‌శర్మ, గంగాధర్, వెంకటాద్రి, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

జగన్‌కు అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదు

కదిరి టౌన్ : అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించే అర్హత సిఎం జగన్‌కు లేదని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్‌బాబు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు విశ్వనాథ్ విమర్శించారు. టిడిపి ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక నేరస్తుడు, పేద, బడుగు బలహీన వర్గాలను దోచుకున్న దోపిడీదారు జగన్‌కు అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదు' అన్నారు. బడుగు బలహీన వర్గాలు, ముస్లిం మైనారిటీల భాగస్వామ్యంతో వైసిపిని గద్దె దించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డెప్ప, ఈవి.రమణ, కదిరప్ప, లక్ష్మన్న, గంగాధర్, రామచంద్ర, ఆంజనేయులు, రాఘవ, సాయి, అనిల్ పాల్గొన్నారు.

ప్రజలను మభ్య పెట్టేందుకే ఎమ్మెల్యే పాదయాత్ర : పల్లె

పుట్టపర్తి అర్బన్ : ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి బూటకపు పాదయాత్ర చేస్తున్నారని, అయితే ప్రజలు వైసిపిని నమ్మరని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం లో శుక్రవారం పల్లె విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు దుద్దుకుంట నియోజకవర్గంలోని 193 చెరువులను నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ప్రగల్బాలు పలికారన్నారు. నియోజక వర్గంలో ఒక్క చెరువుకు కూడా నీరు ఇవ్వలేదని, ఉత్తుత్తి జిఒలు ప్రకటిస్తూ పాదయాత్ర చేసినంత మాత్రాన ప్రజలకు ఒరిగేది ఏమీ లేదన్నారు. ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో లేకుండా అభివద్ధిని గాలికి వదిలేసి సంపాదనే ముఖ్యంగా పని చేస్తున్నారని విమర్శిం చారు. ఇకనైనా ఎమ్మెల్యే అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

నేడు జయహో బిసి

పుట్టపర్తి క్రైమ్ : పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద శనివారం జయహో బిసి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు స్థానిక హను మాన్ కూడలి వద్ద బైక్ ర్యాలీని ప్రారంభించి కర్నాటకనాగేపల్లి, వెంగళమ్మచెరువు, చెర్లోపల్లి, బొంతల పల్లి, సదర్లపల్లి, గెంగిరెడ్డిపల్లి, పెడబల్లి, బత్తలపల్లి, కప్పలబండ, మామిళ్లకుంట్లపల్లి క్రాస్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మీదుగా పుట్టపర్తిలోని టిడిపి కార్యాలయం చేరుకుంటుందన్నారు. జయహో బిసి కార్యక్రమానికి బిసి నాయకులతో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా

అమరాపురం : మడకశిర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని మండల పరిధిలోని ఉదుగురు గ్రామానికి చెందిన ముద్ద రాజు తెలిపారు. అమరాపురంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అండగా ఉంటూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడతానన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తనను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

ధర్మవరం టౌన్ : ప్రతి డ్రైవర్ రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జాగ్రత్తగా వాహనాలు నడపాలని 1, 2వ పట్టణ సిఐలు సుబ్రమణ్యం, అశోక్‌కుమార్ సూచించారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం డిఎం సత్యనారాయణ అధ్యక్షతన రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించగా వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రతి డ్రైవర్ విధులకు హాజరవగానే బస్సు కండీషన్ చెక్ చేసుకుని రోడ్డుపైకి తీసుకురావాలన్నారు. మానవ తప్పిదాల వల్లే 80శాతం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, అప్రమత్తంగా డ్రైవింగ్ చేస్తే వాహనంతో పాటు ఎదుట వాహనదా రులు, పాద చారులు క్షేమంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు, ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రేమ్ కుమార్, ఎఇ సికిందర్, శ్రీరాములు, జిపి రెడ్డి, గ్యారేజ్ కార్మికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టూ టౌన్ సిఐ అశోక్ కుమార్

మడకశిర వైసిపి సమన్వయకర్తగా ఈర లక్కప్ప

ప్రజాశక్తి-మడకశిర



నియోజకవర్గ వైసిపి సమన్వయకర్తగా గుడిబండ మండల పరిధిలోని పలారం గ్రామానికి చెందిన ఈర లక్కప్పను అధిష్టానం నియమించింది. విషయం తెలిసిన వెంటనే ఈర లక్కప్ప అనుచరు లతో వెళ్లి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రస్తుతం ఎమ్మె ల్యేగా ఉన్న పలమనేరు తిప్పేస్వామిని సమన్వయకర్త బాధ్యతల నుంచి తప్పించారు. మారుమూల గ్రామీణ ప్రాంతానికి చెందిన సామాన్య కార్యకర్తగా ఉన్న లక్కప్పను సమన్వయకర్తగా నియమించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. లక్కప్ప అంచెలంచెలుగా ఎదిగి సర్పంచి స్థాయికి ఎదిగి మేజర్ పంచాయితీ గుడిబండ సర్పంచిగా ఐదేళ్లు పని చేసే పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడా నికి కృషి చేశారు. గతంలో ఓ స్వచ్ఛంధ సంస్థలో పనిచేస్తూ అనంతరం ప్రజాసేవలోకి వచ్చారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తుండడంతో అధిష్టానం గుర్తించి సమన్వయకర్తగా నియమించింది. అయితే వైసిపిలో నాలుగైదు గ్రూపులు ఉన్న తరుణంలో ఈయన ఎలా గట్టెక్కుతారోనన్న విషయం చర్చనీయాంశమైంది. ఈర లక్కప్ప మాత్రం అందరినీ సమన్వయం చేసుకొనిపోతూ వైసిపి జెండా ఎగరేసి అధినేత జగన్‌కు మడకశిరను కానుకగా అందజేస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మాజీ మంత్రితో భేటీ

నూతన సమన్వయకర్త ఈర లక్కప్ప నియోజకవర్గంలోనే అత్యధికంగా ఉన్న ఒక్కలిగ సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి హెచ్‌బి.నరసయ్యగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు సహాయ సహకారాలు అందించా లని కోరారు. అలాగే అనుచరులతో కలిసి నియోజక వర్గ వ్యాప్తంగా వైసిపి ముఖ్య నాయకులను కలిసి తనకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

అమరాపురం : వైసిపి సర్పంచి వాగేష్ ఆధ్వర్యంలో నూతన సమన్వయకర్త ఈర లక్కప్పను మండల నాయకులు ఘనంగా సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి విజయం ఖాయమని, నాయకులంతా మీ వెంట ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ఈరన్న, ఎంపిటిసిలు నారాయ ణగౌడ, హనుమంతరాయప్ప, నాయకులు వీరకేతప్ప, కాంతరాజు, అంబరీష్, గుమ్మన్న పాల్గొన్నారు.

యోగి వేమనకు ఘన నివాళి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



కలెక్టరేట్‌లో వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

ప్రజాకవి యోగివేమన జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వేమన చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి కొండయ్య పూలమాలలు వేసి నివాళు లర్పించారు. డిఆర్ఒ మాట్లాడుతూ తెలుగు జాతి, తెలుగువారి కీర్తిని దశ దిశలా తీసుకెళ్లిన మహాకవి యోగి వేమన అని పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను పద్య రూపంలో రచించి ప్రజా కవిగా గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి నరసయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శివరంగప్రసాద్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మోహన్‌రావు, జిల్లా పర్యాటక శాఖ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

హిందూపురం : విలువలతో కూడిన సమాజ నిర్మాణం, మూఢ నమ్మకాలను రూపు మాపడానికి యెగి వేమన తన రచనల ద్వారా చేసిన కృషి అభినందనీయమని మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి అన్నారు. యోగి వేమన జయంతి పురస్కరించుకుని రెడ్డి జెఎసి ఆధ్వర్యంలో వేమన సర్కిల్‌లో విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకురాలు మధుమతిరెడ్డి, రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షులు వెంకటేష్‌రెడ్డి, కౌన్సిలర్ సునీత రెడ్డి, డాక్టర్ అశ్వర్థరెడ్డి, రమేష్‌రెడ్డి నక్కలపల్లి శ్రీరాంరెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, మదన గోపాల్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, హేమంత్ రెడ్డి, ప్రణయ రెడ్డి, ముదిరెడ్డిపల్లి రెడ్డి సంఘం వారు, ఎస్ఎఫ్ఐ చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, నారాయణరెడ్డి, గోపాల్ రెడ్డి పాల్గన్నారు.

పెనుకొండ : రెడ్డి సంఘం ఆధ్వర్యంలో వేమన చిత్రపటాన్ని రథంలో ఉంచి పట్టణంలో ఊరేగించారు. అనంతరం పోస్టాఫీస్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వేమన విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓసీ సంఘం అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర టూరిజం డైరెక్టర్ జాహ్నవిరెడ్డి, రెడ్డి జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్యదర్శి శేషాద్రిరెడ్డి, విగ్రహ దాత జయారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎం.భాస్కర్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, సుధామ, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సుధామ రాజశేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, గంపల రమణారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : వేమన రచనలు సమాజానికి ఆదర్శప్రాయమని రెడ్డి జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామాటం శేషాద్రిరెడ్డి పేర్కొన్నారు. చంద మూరి శివారెడ్డి, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వేమన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రంగారెడ్డి, మాధవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల పరిధిలోని కటారుపల్లిలో యోగి వేమన జయంత్యుత్సవాలను ఎపి రెడ్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగలకుంట నరేష్ కుమార్‌రెడ్డి, కార్యదర్శి విజయ్ కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు బాబుల్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కదిరి టౌన్ : పట్టణంలోని కోర్ట్ సమీపంలో కదిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లింగాల లోకేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, గుమస్తాలు, కోర్టు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



బహుమతులు అందజేస్తున్న సిఐ సుబ్రమణ్యం

క్రీడలతో మానసికోల్లాసం : సిఐ

ధర్మవరం టౌన్ : క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక ధృడత్వం లభిస్తాయని వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా చెరువుకట్ట వద్ద గల శివాలయం సమీపంలో నిర్వహించిన షటిల్ టోర్నీ శుక్రవారం ముగిసింది. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిఐ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసర మన్నారు. క్రీడల ద్వారా ఎంతో మంది ఉన్నతస్థాయి కి చేరుకున్నారన్నారు. టోర్నీ విజేతలు రంగం చైతన్యకుమార్, యంబా లోకేష్‌ల కు రూ. 10వేలు, మదన్మోహన్, ఆదినారా యణల కు రూ. 5వేలు, గుణశేఖర్, విజయ్‌లకు రూ. 2500, రమేశ్, అలీలకు రూ. 1000 చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో ఫయాజ్, మహేంద్ర, మదన్మోహన్, మేకల పురుషోత్తం, మురళీకృష్ణ, విజయరాఘవ, వాసు, రామాంజనేయులు, ఆదినారాయణ పాల్గొన్నారు.

'హిట్ అండ్ రన్' కేసులు రద్దు చేయాలి

ఓబుళదేవరచెరువు : కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన హిట్ అండ్ రన్ కేసులను రద్దు చేయాలని సిఐటియు (ట్రాన్స్‌పోర్ట్ రంగం) జిల్లా కార్యదర్శి బాబావలి, ఉపాధ్యక్షులు కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన హిట్ అండ్ రన్ కేసుల వల్ల వాహనదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో భగత్‌సింగ్ ఆటో యూనియన్ ఉపాధ్యక్షులు రామాంజనేయులు, వెంకటరమణ, మారెప్ప, నరసింహులు, రఘు, వాహనదారులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

కదిరి టౌన్ : తలుపుల మండల పరిధిలోని పెద్దన్నవారి పంచాయతీ సంగటివారి పల్లికి చెందిన 20 వైసిపి కుటుంబాలు శుక్రవారం పట్టణంలోని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో కందికుంట భార్య యశోదదేవి సమక్షంలో టిడిపిలో చేరారు. వైసిపికి చెందిన బాల బయ్యప్ప, రెడ్డి శేఖర్, మల్లికార్జున, బయప్ప, రవీంద్ర, వెంకటసుబ్బయ్య, బాల బయ్యన్న, ఎర్ర మల్లయ్య, శంకర, ప్రసాద్, పాపయ్య, రమణ, మల్లేష్, రామచంద్ర, కుమార్‌లకు యశోదదేవి టిడిపి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మేడా శంకర, రామ్మోహన్, విశ్వనాథ్‌రెడ్డి, శ్రీశైలం రమణ, జయచంద్ర, బాబ్‌జాన్, షేక్‌బాషా, రమణ, చిన్న మల్లేష్, వసంతనాయుడు, అమర, గట్టి అశోక్ పాల్గొన్నారు.

21న ఆయుర్వేద వైద్యశిబిరం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని సంజయ్ నగర్‌లో ఉన్న బిఎస్ఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 21వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఉచిత సిద్ధ ఆయుర్వేద యోగ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సేవా భారతి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ నిర్వాహకులు తిరుమలేశు, నరేష్‌బాబు, దాసరి రామన్న, రవీంద్రదాస్ తెలిపారు. శిబిరంలో అన్ని రకాల సమస్యలకు ప్రముఖ ఆర్థో న్యూరో, ఆక్యుప్రెజర్ నిపుణులు గురూజీ జైశ్రీరామ్ చికిత్స చేస్తారని తెలిపారు. ఆధార్ కార్డు తప్పనిసరి అన్నారు.

బహుజనుల అభివృద్ధే బీఎస్పీ ధ్యేయం

కొత్తచెరువు : బహుజనుల అభివృద్ధే బీఎస్పీ ధ్యేయమని పుట్టపర్తి నియోజకవర్గ ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అంపావతి గోవిందు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గెలిపిస్తే బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు.

కారు, బైక్ ఢీ.. ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-తనకల్లు

మండల పరిధిలోని గంగసా నిపల్లి వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదం లో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. అమడగూరు మండలంలోని కందుకూరువాండ్లపల్లికి చెందిన జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వలస ఆంజనేయులు భార్య, కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై మొలకలచెరువు వైపు వెళ్తుండగా గంగసానిపల్లి సమీపంలో ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వందేమాతరం టీమ్ సభ్యులు బాగేపల్లి అశోక్, షాకీర్, రమణ, జనసేన నాయకులు కొట్టి అనిల్ కుమార్, కొట్టి కిరణ్ కుమార్ వారిని 108లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి కదిరికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.